క్లుప్తంగా

కబడ్డీ పోటీల్లో ప్రతిభ



అడ్డాడ(పామర్రు): కబడ్డీ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని అరవింద ఇంటిగ్రల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రమణమూర్తి తెలిపారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని హైస్కూల్‌లో విజేతలను శనివారం అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గుడివాడలోని వీకేఆర్ పాలి ఫెస్ట్ 2023 కబడ్డీ సీనియర్స్ పోటీలు శుక్రవారం నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. విజేతలను, పీఈటీ ఎం.సురేష్‌బాబులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ముదినేపల్లి రూరల్: విజయవాడలోని ఓ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతోన్న పింఛన్‌దారునికి వలంటీర్ శనివారం పింఛన్ అందజేశారు. వైవాక గ్రామానికి చెందిన కత్తుల మంగమ్మ విజయవాడలో చికిత్స పొందుతోంది. ఆదివారంతో పింఛన్ తీసుకునేందుకు గడువు ముగిస్తుండడంతో వలంటీర్ శీలం గాంధీ మోహన్ శనివారం ఆస్పత్రికి వెళ్లి మంగమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు. దీంతో ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



ఈదులమద్దాలి(పెదపారుపూడి): జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ ఎం.నాగిరెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఈదుల మద్దాలిలో జగనన్న లే అవుట్‌లో శనివారం అధికారులతో కలిసి ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి సదుపాయాలను కల్పిస్తుందన్నారు. బెసిమెంట్ పనులు పూర్తి చేయగానే బిల్లులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, వెలుగు ఏపీఎం వసంతరావు పాల్గొన్నారు.

నాడు - నేడు పనుల పరిశీలన



మండవల్లి: మండలంలోని పెరికెగూడెం యూపీ పాఠశాలలో నాడు - నేడు పనులను ఎంఈఓ కె.నరేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ పనులతో పాఠశాలలు కొత్త శోభను సంతరించుకున్నాయని, విద్యార్థులు స్కూల్స్‌పై మక్కువ పెరిగి ఉత్తమ ఫలితాల సాధనకు అవకాశం ఏర్పడిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. హెచ్‌ఎం డి.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్యదేవుని గ్రామోత్సవం

గుడ్లవల్లేరు: శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తుల గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామివారికి భక్తులు పండ్లు, కొబ్బరికాయలను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో హోమాల్ని వేద పండితులు చేపట్టారు. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. శుక్రవారం రాత్రి కల్యాణోత్సవాన్ని చేపట్టారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే ప్రాణాలకు రక్షణ ఉంటుందని ఎస్ఐ పల్లా నాగకళ్యాణి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ ప్రధాన సెంటర్‌లో శనివారం హెల్మెట్ వాడకం, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ముందుకు సాగుతుందన్నారు. మత్తు పదార్థాల విక్రయాలపై 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన

కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్



కలిదిండిలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు(కలిదిండి): అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిన అందిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, ఎంపీటీసీ సభ్యులు నీలి సుమన్, మహమ్మద్ సఫాయితుల్లాల ఆధ్వర్యంలో కలిదిండి సచివాలయ - 1 పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ సీఎం జగన్ నేతృత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం రూపంలో లబ్ధి చేకూరుతోందన్నారు. డ్వాక్రా మహిళలను పసుపు, కుంకుమల పేరుతో గత ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేస్తే, నేడు సీఎం జగన్ డ్వాక్రా సంఘాల అప్పులను తీరుస్తూ, వారికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. నేడు మూగజీవాలకు కూడా వైద్య సేవలు ఇంటి వద్దే అందిస్తోన్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తొలుత గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు ఎమ్మెల్యే నివాళులర్పించారు. మూడున్నరేళ్లలో పథకాల ద్వారా అందిన లబ్ధిపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.

పార్టీలో చేరికలు

సీఎం జగన్ చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇందిరా కాలనీలో పెద్ద ఎత్తున యువత, మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, నాయకులు గొరిపర్తి సుబ్బారావు, యాళ్ల జీవరత్నం, నున్న భగవాన్, నీలపాల భోగేశ్వరరావు, మంగిన భాస్కర్, పోసిన కొండ, తహసీల్దార్ తేజోమణి, సీతారాంకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

11న మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రజని

గుడివాడరూరల్: ఈనెల 11వ తేదీన నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.రజని పేర్కొన్నారు. స్థానిక గుడివాడ కోర్టు భవన సముదాయాల్లో న్యాయసేవాధికార కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. పోలీసు అధికారులు, సేవాధికార కమిటీ సభ్యులకు ఆమె పలు సూచనలు చేశారు. రాజీపడే కేసుల్లో ఇరువర్గాలు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. లోక్ అదాలత్‌లో సామరస్య పూర్వకంగా పలు కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిశోర్ కుమార్, అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ నాగలక్ష్మి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.శ్రీదేవి, డీఎస్పీ ఎస్.సత్యానందం, పోలీసు అధికారులు, న్యాయ సేవా అధికార కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేధింపుల ఫిర్యాదుపై విచారణ

మొవ్వ: మొవ్వ మండల ఏపీఎం కాకుమాను సుబ్బారావు అసభ్యకర పదజాలంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఏపీఎం కార్యాలయ ఉద్యోగిని ఈ నెల 3న బందరు పీడీ కార్యాలయం వద్ద సీసీలు, వీఓఏలతో కలిసి నిరసన తెలిపి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మొవ్వ గ్రామంలోని మహిళా సమైఖ్య కార్యాలయంలో ఎంక్వైరీ కమిటీ సభ్యులైన స్త్రీ నిధి ఏజీఎం శ్యామలాదేవి, చల్లపల్లి ఏరియా కో ఆర్డినేటర్ ఆంజనేయులు శనివారం విచారణ నిర్వహించారు. బాధితుల నుంచి స్టేట్ మెంట్‌లు రికార్డు చేసుకున్నామని, ఈ నివేదికను పీడీ ప్రసాదరావుకు అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు.

భార్యపై కర్రతో దాడి.. కేసు నమోదు

కూచిపూడి(మొవ్వ): భార్య తలపై కర్రతో దాడి చేసిన భర్తపై కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మొవ్వ మండలం బార్లపూడి గ్రామానికి చెందిన ఆరేపల్లి సాయి మౌనికకు, అరవింద్‌కు కొంత కాలం క్రిందట ప్రేమ వివాహం జరిగింది. చెడు వ్యసనాలకు బానిసైన అరవింద్ కొద్ది రోజులుగా భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో తల్లి దగ్గరకు వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సాయి మౌనిక కూచిపూడి నుంచి బార్లపూడి వెళ్తుండగా రాత్రి 10గంటల సమయంలో భర్త కర్రతో దాడి చేశాడు. గాయాల పాలైన సాయి మౌనిక పోలీస్ స్టేషన్‌కు రాగా ఫిర్యాదు స్వీకరించి, చికిత్స నిమిత్తం చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ పి.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా రామలింగేశ్వరుని కల్యాణోత్సవం



కైకలూరు స్థానిక శ్యామలాంబ దేవస్థానంలోని అమ్మవారి ఆలయ కళావేదికపై రామేశ్వర, రామలింగేశ్వర, కనకలింగేశ్వర స్వామివార్ల వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ న్యాయవాదులు గొర్తి ప్రభాకరదీక్షితులు, గురజాడ ఉదయశంకర్ దంపతులు కల్యాణం జరిపించారు. యాజ్ఞికులు గొర్తి రమణ కల్యాణ క్రతువును పూర్తి చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. రామలింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ బూరుబోయిన మోహనరావు, ఈఓ వీఎన్‌కే శేఖర్, ప్రముఖులు వేంపాటి విష్ణురావు, ముత్తంరాజు శర్మ, లోయ రంగారావు, అర్చకులు చావల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

78 మందికి దంత వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఏలూరు సెంట్ జోసఫ్ డెంటల్ కాలేజీ దంత వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 78 మందికి వైద్య పరీక్షలు చేశామని నిర్వాహకులు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించామన్నారు.

స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

కైకలూరు: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఈ నెల నుంచి స్కిల్ హబ్ ద్వారా రెండు కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రవీంద్ర శనివారం చెప్పారు. అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు కామర్స్ బ్యాక్ గ్రౌండ్స్‌లో ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుకు పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో మూడు నెలల శిక్షణ ఉంటుందని, 18 నుంచి 30 ఏళ్ల వయసు ఉండాలని, శిక్షణా కాలంలో స్టైఫండ్, అనంతరం సర్టిఫికెట్ అందిస్తారని తెలిపారు. అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 8వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వివరాలకు ఫోన్ నంబర్ 97013 57315లో సంప్రదించాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలు



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ సభ్యులు



కైకలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వికాస తరంగిణి సభ్యులు

గుడివాడరూరల్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో శనివారం వరల్డ్ క్యాన్సర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గురురాజు హోమియో ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ రెడ్డి లక్ష్మి పాల్గొని క్యాన్సర్ రకాలు, వాటి నిర్ధారణపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు పర్వతనేని చంద్రశేఖరరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఆర్జా ప్రసాద్, వంగవండు బ్రహ్మాజీ, సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, మున్నలూరి రామకృష్ణ, పొన్నూరు సత్యనారాయణ, మాచర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ఏఎన్నార్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

గుడివాడరూరల్: అవగాహనతోనే క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టవచ్చని ఏఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెఎస్ అప్పారావు పేర్కొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు డాక్టర్ ఎస్.శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పిజెఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.జేసు బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ లక్షణాలను ఆదిలోనే గుర్తించాలి

కైకలూరు: క్యాన్సర్ లక్షణాలను ఆదిలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని స్థానిక వికాస తరంగణి అధ్యక్షురాలు చిట్టి హేమలత అన్నారు. శ్రీ త్రిదండి చినజీయర్ రామానుజయాచార్యులు ఆదేశాలతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య రంగంలో అనేక మార్పులు వచ్చాయని, అనుమానం వచ్చినప్పుడు తప్పక పరీక్షలు చేసుకోవాలని హేమలత సూచించారు. కార్యక్రమంలో సభ్యులు కామాక్షి, చైతన్య, మాధవి, లక్ష్మి, బాల, రోజా, భాగ్యలక్ష్మి, వీరమణి, మల్లేశ్వరి, రామలక్ష్మి పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

తోట్లవల్లూరు: ఇంటి అద్దె విషయంలో కౌలురైతుపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెనమకూరుకు చెందిన వాకా శ్రీనివాసరావు తన స్నేహితుడికి బోలెం రాంబాబు బంధువులకు చెందిన ఇంటిని అద్దెకు ఇప్పించాడు. అద్దెకు తీసుకున్న వ్యక్తి అద్దె చెల్లించకపోవటంతో శ్రీనివాసరావును శుక్రవారం రాంబాబు నిలదీశాడు. ఛాతీపై దాడి చేయడంతో బైక్ లాక్కోవటంతో శ్రీనివాసరావు అస్వస్థతకు గురయ్యాడు. అతనిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దాడికి పాల్పడిన రాంబాబును శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు ఎస్ఐ జి.రమేష్ తెలిపారు.

మినుములో ఎండు తెగులు నివారణకు చర్యలు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ జరీనా

మండవల్లి: మినుము పొలాల్లో ఎండు తెగులను గుర్తించామని మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా పేర్కొన్నారు. భూమిలో ఉండే శిలీంద్రం వేరు ద్వారా మొక్కలోనికి ప్రవేశించడం వల్ల క్రమేపీ మినుము ఆకులు పసుపు పచ్చరంగులో మారి తొడిమలు, ఆకులు, కాండం, వేళ్లు క్రమేపీ ఎండిపోతాయన్నారు. వేరు లోపలిభాగం ముదురు గోధుమ రంగు కలిగి ఉంటుందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రత, బెట్ట పరిస్థితులు, చౌడు పొలాల్లో ఈ తెగులు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు.

నివారణ చర్యలు

ఎండు తెగులు తట్టుకునే రకాలైన ఎల్‌బీజీ 402, 645, 648, 752 రకాలను సాగు చేయాలని ఏఓ జరీనా చెప్పారు. ట్రైకోడర్మావిరిడి 10 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలన్నారు. పశువుల ఎరువు 90 కిలోలు, వేప పిండి 10 కిలోలు, ట్రైకోడర్మావిరిడి 2 కిలోలు కలిపి అభివృద్ధి పరచిన భూమిలో చల్లాలని చెప్పారు. మినుము పైరులో మల్లీకే ఒక కేజీ ఎకరం పొలంలో పిచికారి చేయాలని ఏఓ సూచించారు.

విద్యతో మహిళా సాధికారత సాధ్యం



డాక్టర్ దుర్గను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న అధ్యాపకులు

గుడ్లవల్లేరు: విద్యతో మహిళా సాధికారత సుసాధ్యవుతుందని హైదరాబాద్ ఏఎఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎల్.కె.దుర్గ అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కింద గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు ఆమె అవగాహనా సదస్సును చేపట్టారు. విద్యా బుద్ధుల్లో భాగంగా క్రమశిక్షణతో కూడిన వైఖరిని విద్యార్థులు అలవరచుకోవాలన్నారు. ఆమెను కాలేజీ యాజమాన్యం సన్మానించి జ్ఞాపికను అందించారు. ఎన్ఎస్ఎస్ ప్రతినిధి వి.ఎల్.వినోద్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ టి.ప్రశాంతి, డాక్టర్ టి.బాలకృష్ణ, టి.శ్రావణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థుల రాణింపు



విజేతలతో ప్రిన్సిపాల్ సత్యనారాయణ

గుడ్లవల్లేరు: విజయవాడ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ వేదికగా ఈ నెల 1, 2, 3వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు తమ ప్రతిభను చాటారని గుడ్లవల్లేరు ఏఎఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సి పాల్ సత్యనారాయణ శనివారం తెలిపారు. బాలికల వాలీబాల్, టేబుల్ టెన్నిస్‌లో విన్నర్స్‌గాను, బాలుర 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమం, బాల్ బ్యాడ్మింటన్‌లో రన్నర్స్‌గా, 200 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానాన్ని చేజిక్కించుకున్నారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన తమ విద్యార్థులకు జాతీయ స్థాయి సౌత్ జోన్ పోటీల్లో తలపడేందుకు అర్హత సాధించారన్నారు. విజేతలను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ, సహ కార్యదర్శి రామకృష్ణ, మెంటార్ ఎన్.ఎస్.వి.వి.రామాంజనేయులు తదితరులు అభినందించారు.

సహకార సంఘాలు రైతులకు అండగా ఉండాలి

ఎమ్మెల్యే కొడాలి నాని



సొసైటీ అధ్యక్షుడు, పాలకవర్గంతో ఎమ్మెల్యే నాని

గుడివాడటౌన్(నందివాడ): సహకార సంఘాలు రైతులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. నందివాడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేములపల్లి వెంకటేశ్వరరావు ప్రాథమిక వ్యవసాయ సంఘం భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అవసరాలను గుర్తించి సాధ్యమైనంత వరకు పెద్ద మొత్తాల్లో రుణాలు ఇచ్చేందుకు సంఘం పాలకులు చొరవ చూపాలన్నారు. నాబార్డ్ ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుని వాటిని ప్రజలకు, రైతులకు, చిరు వ్యాపారులకు అందజేయడం ద్వారా బ్యాంకు ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నెరుసు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తోట నాగరాజు, ఎంపీపీ పెయ్యల ఆదాం, నాయకులు దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, గూడపాటి వెంకటేశ్వరరావు, కొండపల్లి కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భూముల రీ సర్వే దేశానికే రోల్ మోడల్



సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివయ్య

పామర్రు(పమిడిముక్కల): జగనన్న భూ హక్కు.. భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన భూముల రీ సర్వే దేశానికే రోల్ మోడల్ అని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.వెంకటశివయ్య అన్నారు. పమిడిముక్కల మండలం గుర్రాలు లంక, హనుమంతపురం గ్రామాల్లో సర్వే ఆఫ్ ఇండియా వారి ద్వారా డ్రోన్ ప్లై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ఈ సర్వే పనులను ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. దీని వల్ల భవిష్యత్‌లో భూ వివాదాలు ఉండవని చెప్పారు. ముఖ్యమంత్రి తీసుకువచ్చిన ఈ సాహసోపేతమైన నిర్ణయం భవిష్యత్‌లో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఈ సర్వే చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో హనుమంతపురం, గుర్రాలు లంక గ్రామాల ప్రజా ప్రతినిధులు, మండల పరిషత్ అధికారులు, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మీకామేశ్వరి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారిని తీసుకొస్తున్న కావూరి వంశీయులు

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండల కూడేరు గ్రామంలో వేం చేసి ఉన్న కావూరి వంశీయుల ఇలవేలుపైన ఆదిలక్ష్మీ కామేశ్వరి అమ్మవారికి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాల నుంచి కావూరి వంశీయుల కుటుంబసభ్యులు వేడుకల్లో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు శనివారం అమ్మవారిని కూడేరు గ్రామం నుంచి ఐనపూరు గ్రామం తీసువచ్చి అక్కడ ఉన్న కృష్ణా నదిలో మంగళ వాయిద్యాలతో వేద మంత్రోచ్చరణల నడుమ మంగళ స్థానాదికాలను నిర్వహించారు. అనంతరం పూజాది కార్యక్రమాలు చేశారు. గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో మహిళలు లలిత పారాయణ నిర్వహించారు.

ఉత్తమ సేవలకు సత్కారం



అవార్డు గ్రహీతలైన అధికారులను సన్మానిస్తున్న నాయకులు

పామర్రు(పమిడిముక్కల): ప్రజలకు ఉత్తమమైన సేవలను అందించిన అధికారులను ప్రభుత్వం ప్రోత్సహించే విధంగా వారికి ఉత్తమ సేవా పురస్కారాలను అందించి గౌరవిస్తోందని పామర్రు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ మారపాక మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులను జనవరి 26న జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సందర్భంగా అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పమిడిముక్కల మండల వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో వీరంకిలాకు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజా, మండల సర్వేయర్ బేతపూడి శ్యామ్ మణికుమార్, ఏపీఓ వెంకటేశ్వరరెడ్డిలను వారి వారి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, సీనియర్ నాయకులు పాతూరిచంద్ర పాల్, సచివాలయ కన్వీనర్ బొల్లా రాంబాబు, మన్నే కృష్ణ కిషోర్, కొక్కిలిగడ్డ ఆనంద్, కొండవీటి రాజు, మన్నే రమేష్ ఉన్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థి



విద్యార్థిని తల్లికి అప్పగిస్తున్న ఏఎస్ఐ రాజు

మండవల్లి: తల్లి మందిలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థిని పోలీసులు 24 గంటల్లోనే అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండవల్లి మండలం అప్పాపురం గ్రామానికి చెందిన కొండా మణిదీప్ (13) అనే విద్యార్థి సక్రమంగా పాఠశాలకు వెళ్లడం లేదని ఈ నెల 2న అతని తల్లి మందలించింది. దీంతో స్కూల్ వెళుతున్నట్లు చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్లలేదు. తల్లి భాగ్యలక్ష్మి ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ వైవీవీఎల్ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ టి.రామకృష్ణ, ఏఎస్ఐ కె.రాజు 3 బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని నరసాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని బడ్డీ కొట్టులో ఉన్న మణిదీప్‌ను అతని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో మణిదీప్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.